ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 6 ఆగస్టు 2024

అప్పుల్లో యువత

గ్రామాలు వదులుతున్న వైనం



బెట్టింగ్ కోసం కొందరు... అవసరాల కోసం మరికొందరు... జల్సాలకు ఇంకొందరు... ఇబ్బడిముబ్బడిగా రుణాలు... లోన్‌యాప్‌ల ఉచ్చులో చిక్కుకుని విలవిల

హిందూపురం మండలంలోని మరువపల్లికి చెందిన ఓ యువకుడు కొన్నిరోజుల క్రితం ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి రూ.70వేల దాకా యాప్‌లో రుణం పొందాడు. దానిని తిరిగి చెల్లించలేక, యాప్ నిర్వాహకుల వేధింపులకు భయపడి ఆత్మహత్య చేసుకున్నాడు.



పారిశ్రామిక వాడలోని ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఓ యువకుడు చాలీచాలని వేతనంతో ఇబ్బందులు పడ్డాడు. బయట అప్పులు చేయకతప్పలేదు. వచ్చే వేతనం చాలక, అప్పు తీసుకున్న వారి నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో ఆ యువకుడు గ్రామం వదిలి వెళ్లిపోయాడు.

హిందూపురం పట్టణానికి చెందిన ఓ యువకుడు సొంత అవసరాల కోసం ఆటోనగర్‌లో ఓ మహిళ వద్ద అప్పు తీసుకున్నాడు. ఆ యువకుడు రూ.25వేలు అప్పు తీసుకోగా.. వారానికి రూ.వెయ్యి వడ్డీ చెల్లించాలి. అది మూడు వారాలు కట్టకపోవడంతో వడ్డీకి ఇచ్చిన మహిళ ప్రతీవారం రూ.2500 వడ్డీ చెల్లించాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో చేసేదిలేక ఆ యువకుడు ఉన్న ద్విచక్రవాహనాన్ని అమ్మేసి, కట్టేశాడు. కుటుంబసభ్యులు దండించడంతో పట్టణం వదిలాడు.

కొట్నూరుకు చెందిన ఓ యువకుడు డిగ్రీ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి జల్సాలకు అలవాటుపడ్డాడు. అతడిది గ్రామంలో పరువుగల కుటుంబం కావడంతో అడిగిన చోటంతా అప్పు ఇచ్చారు. సదరు యువకుడు ఆ మొత్తాన్ని కట్టలేక, కళాశాల చదువు మానేసి వెళ్లిపోయాడు. ఇవి కొన్ని మాత్రమే. పట్టణాలు, పల్లెల్లో ఇలాంటివి కోకొల్లలు. యువత అప్పుల ఊబిలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. కొంతమంది చేసిన అప్పులను కుటుంబ సభ్యులు చెల్లిస్తుంటే.. మరికొంత మంది కుటుంబాలు రుణాలు కట్టలేక ఆర్థికంగా చితికిపోతున్నాయి. దీంతో సొంతూళ్లను వదిలి, బయట ప్రాంతాలకు వెళ్లిపోయి నెలల కొద్దీ తిరిగిరాని పరిస్థితి నెలకొంది.

- హిందూపురం

వస్తువులపై కొందరు..



హిందూపురంలో కొందరు వ్యాపారులు తమ వద్ద వస్తువులు పెట్టుకుని, అప్పులు ఇస్తున్నారు. కొంతమంది యువత ద్విచక్రవాహనాలు, బంగారు వస్తువులు, మరికొంతమంది ఇళ్లలో పెద్దవారికి తెలియకుండా ఇంటిపత్రాలు పెట్టి రుణాలు తీసుకుంటున్నారు. మరికొంతమందైతే సెల్‌ఫోన్లు సైతం తాకట్టుపెట్టి రుణం పొందుతున్నారు. రుణాలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. వడ్డీకి ఇచ్చినవారు వెంటపడుతుండటంతో కొంత మంది కట్టలేక వస్తువులు వదిలేసి, వెళ్లిపోతున్నారు.

బెట్టింగ్ కోసం..



ఇటీవల క్రికెట్ బెట్టింగ్ కోసం రుణాలు విరివిగా చేస్తున్నారు. ఒకరోజు ఓడితే మరో రోజు గెలవకపోతామా అన్న ధీమాతో అప్పులు చేసి, కుటుంబాలను బజారున పడేస్తున్నారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలు చేస్తున్న రుణాలు బయటకు చెప్పలేక పరువుపోతుందని బాధను దిగమింగుతూ బాధ భరిస్తున్నారు. ఇటీవల పట్టణంలోని వాణిజ్యకేంద్రంగా పేరుగాంచిన ప్రాంతానికి చెందిన యువత బెట్టింగ్‌పై ఎక్కువగా ఆధారపడినట్లు తెలుస్తోంది. వారిలో చాలామంది ప్రతివారం గోవాకు వెళ్లి అక్కడ గేమ్ ఆడుతున్నట్లు సమాచారం. ఇక్కడి డబ్బు తీసుకెళ్లి అక్కడ గేమ్ ఆడి గెలిస్తే గ్రామానికి వస్తారు. ఓడితే కొన్నినెలలపాటు అక్కడే ఉండిపోతున్నారని వారి తల్లిదండ్రులు.. పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

తొందరగా రుణం వస్తుందని..



చాలామంది యువత అప్పుల ఊబిలో కూరుకుపోయి, అవస్థలు పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ నుంచి చిరుద్యోగులు, ఆఖరుకు రైతులు కూడా ఆన్‌లైన్ యాప్‌ల ఉచ్చులో చిక్కి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. హామీలేకుండా రుణాలు ఇస్తామని చెప్పడంతో వాటికి ఆకర్షితులై అవసరమైనవారు తేలికగా రుణాలు పొందుతున్నారు. ఆ తరువాత రోజువారీ వడ్డీ చెల్లించలేక, వారి బెదిరింపులకు తట్టుకోలేక యాతన పడుతున్నారు.

యాప్‌ల ఉచ్చులో చిక్కుకుని విలవిల

ఫోన్, పాన్‌కార్డు ఉంటే చాలన్న రీతిలో రుణాలు అందజేసే యాప్‌లు కోకొల్లలున్నాయి. యాప్ ఓపెన్‌చేసి ఓ పాన్ నంబరు ఎంటర్‌చేస్తే చాలు.. రుణాలు పొందడానికి అర్హులా.. కాదా.. అని నిర్వాహకులు సమాచారం ఇస్తారు. అర్హత ఉంటే చాలు రుణం తీసుకునేందుకు నిత్యం పదులసార్లు ఫోన్‌కాల్స్ చేసి, వెంట పడుతుంటారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు ఈ యాప్‌ల ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. కొంతమంది కట్టలేకపోవడంతో వారి స్నేహితుల ఫోన్‌నంబర్లతో వేధింపులకు దిగుతున్నారు. దీంతో వారు మానసికంగా కుంగిపోతున్నారు. ఇలా యువత అప్పుల ఊబిలో చిక్కుకుని, నానా ఇబ్బందులు పడటమేకాక వారి తల్లిదండ్రులకు కూడా మానసిక క్షోభ తెచ్చిపెడుతున్నారు.

యువత అప్పుల జోలికి వెళ్లకూడదు..



అప్పు అవసరమైతే యువత.. తల్లిదండ్రుల ద్వారానే తీసుకోవాలి. నేరుగా తీసుకోవడానికి అలవాటుపడితే ఇబ్బందులు తప్పవు. రుణ యాప్‌ల జోలికి వెళ్లి అప్పుల పాలు కావద్దు. చిరుద్యోగులు సైతం అనుమతి ఉన్న బ్యాంకుల ద్వారానే రుణాలు తీసుకోవాలి. యువత జల్సాలు, బెట్టింగ్‌కు అలవాటుపడి అప్పులు చేసి, అందమైన జీవితాలను నాశనం చేసుకోవద్దు.

కంజక్షన్, డీఎస్పీ, హిందూపురం





ముఖ్యమంత్రి సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్, డీజీపీకి మొక్క అందజేస్తున్న ఎస్పీ రత్న

సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి, ఆగస్టు 5: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలోని సచివాలయంలో సోమవారం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న పాల్గొన్నారు. ప్రతినెలా పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు నిబద్ధతతో పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ రత్న.. డీజీపీ ద్వారకాతిరుమలరావును మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

మినీగోకులాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 5: మినీగోకులాల నిర్మాణానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శుభదాసు సోమవారం ప్రకటనలో తెలిపారు. పాడిపారిశ్రమ, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు చేయూతనిచ్చేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వివరాలకు పశువైద్యశాఖ కార్యాలయాల్లోగానీ, రైతుసేవా కేంద్రాల్లోగానీ సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రజాఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి: డీఆర్వో



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్వో కొండయ్య

పుట్టపర్తి, ఆగస్టు 5: ప్రజల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలంటూ డీఆర్వో కొండయ్య.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు వివిధ సమస్యలపై 196 అర్జీలు అందించారు. డీఆర్వో కొండయ్య వాటిని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారం చూపాలన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు.

డీపీఓలో 40 ఫిర్యాదులు

పుట్టపర్తిరూరల్: పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 40 అర్జీలు వచ్చాయి. వాటిని ఏఎస్పీ విష్ణు స్వీకరించారు. వీటిపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

పెనుకొండ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

పెనుకొండ టౌన్, ఆగస్టు 5: పెనుకొండ డీఎస్పీగా ఏ శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బాజీజాన్ సైదాను హెడ్‌క్వార్టర్స్‌కు రిపోర్ట్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ స్థానంలో నెల్లూరు క్రైం కంట్రోల్ విభాగంలో పనిచేస్తున్న ఏ శ్రీనివాసులును నియమించింది. దీంతో బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ.. 2017లో పెనుకొండ సీఐగా పనిచేశానన్నారు. పేకాట, ఇసుక అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి, కట్టడి చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ ఏ శ్రీనివాసులు

అంగన్‌వాడీలపై

వేధింపులు ఆపాలి

పుట్టపర్తి, ఆగస్టు 5: జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులను వెంటనే ఆపాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు.. డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, నిరుద్యోగులు పట్టణంలో నిరసన ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకన్నారు. అక్కడే బైఠాయించి, నినాదాలు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ.. చిరుద్యోగులు, స్కీంవర్కర్లపై రాజకీయ వేధింపులు, ఉద్యోగాల నుంచి తొలగించే విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నేతలు నరసింహులు, దిల్‌షాద్, సాంబ, పెద్దన్న, రమణ, అంగన్‌వాడీ నేతలు మాబున్నీషా, శ్రీదేవి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రెవెన్యూ అధికారులను

సస్పెండ్ చేయాలి

మఠం భూమి వన్‌బీలో నమోదు చేసిన కబ్జాదారుల పేర్లు తొలగించాలి

సీపీఐ నాయకుల డిమాండ్

తహసీల్దార్ కార్యాలయం ముందు మహాధర్నా

బత్తలపల్లి, ఆగస్టు 5: మండలకేంద్రంలోని నిడిమామిడి జంగం మఠం భూమిని ఆన్‌లైన్ చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం మహాధర్నా నిర్వహించారు. మధు మాట్లాడుతూ.. బత్తలపల్లిలోని నిడిమామిడి జంగం మఠం భూమిని కొందరు వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. ఇది దేవదాయ భూమి అనీ, ఎవరూ క్రయవిక్రయాలు చేయరాదని ఆ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్ అప్పట్లో ఉత్తర్వులు జారీచేసినా.. వాటిని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులు బేఖాతర్ చేశారన్నారు. డబ్బుకు అమ్ముడుపోయి ఆక్రమణదారుల అడుగులకు మడుగులొత్తుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మఠం భూమి ఆన్‌లైన్ చేసిన అధికారులను సస్పండ్ చేయాలని డిమాండ్ చేశారు. మఠం భూమిలో పేదలకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదన్నారు. త్వరలో ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. అనంతరం మఠం భూమికి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పేర్లను తొలగించాలని సీఎస్‌డీటీ శారదకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎస్‌డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మళ్లీ.. మంచిరోజులు..!

- గత టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్లు ప్రారంభం
- ఎందరో పేదల ఆకలి తీర్చిన వైనం
- వైసీపీ అధికారంలోకి రాగానే మూసివేత
- కూటమి విజయంతో పునఃప్రారంభానికి చర్యలు
- ఈ నెల 15న రీ ఓపెన్



ధర్మవరంలో ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

ధర్మవరం, ఆగస్టు 5: పేదల ఆకలితీర్చేందుకు ఈనెల 15 నుంచి అన్నక్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. గత టీడీపీ హయాంలో అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేశారు. రూ.5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనం అందించేవారు. వివిధ పనుల కోసం పట్టణాలకు వచ్చే పేదవారు, ఆటో కార్మికులు, వివిధ వ్యాపార సంస్థల్లో పనిచేసే వారికి అన్న క్యాంటీన్లు కడుపునిండా అన్నం పెట్టేవి. ఈ వాటికి పక్కా భవనాలు సైతం నిర్మించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. పేదల కడుపుకొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాంటీన్లను మూసివేయించారు. దీంతో పేదలు ఇబ్బందులు పడ్డారు. అలా మూతపడిన క్యాంటీన్లు ఐదేళ్ల తరువాత స్వాతంత్ర్య దినోత్సవాన తెరుచుకోనున్నాయి.

గత వైసీపీ పాలనలో నానా ఇబ్బందులు

2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అన్నక్యాంటీన్లపై కక్ష పెంచుకున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్న అక్కసుతో రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను మూత వేయించారు. దీంతో పేదలకు భోజనం భారమైంది. హోటళ్లలో తినే స్థోమతలేని వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో మళ్లీ పేదల్లో ఆశలు చిగురించాయి. ఎన్నికల ప్రచారంలో కూడా అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు తెరిచి, పేదల ఆకలి తీర్చుతామని చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న నెరవేర్చబోతున్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఐదేళ్లలో పాడుబడిపోయిన అన్న క్యాంటీన్ భవనాల మరమ్మతులు చేపడుతున్నారు. ధర్మవరం పట్టణంలో గతంలో రెండుచోట్ల అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయగా.. వాటిని పునరుద్ధరించడానికి కూటమి నాయకులు పనులు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14 అన్న క్యాంటీన్లు గతంలో ఉండేవి. వాటిని పునరుద్ధరించడానికి కూటమి నాయకులు ప్రస్తుతం చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పెనుకొండలో మంత్రి సవిత సొంత డబ్బుతో మూడేళ్లుగా అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ అన్న క్యాంటీన్‌ను పునరుద్ధరించారు. కదిరి, పుట్టపర్తి, మడకశిర, రాప్తాడు, ధర్మవరం ప్రాంతాల్లో కూడా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి, పేదల ఆకలి తీర్చడానికి ఏర్పాటు చేస్తున్నారు.

ఆనందంగా ఉంది: నాగన్న, ధర్మవరం



అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభిస్తున్నారని తెలిసినప్పటి నుంచి ఎంతో ఆనందంగా ఉంది. బేల్దారి పనులు చేసేందుకు బయటకు వచ్చినపుడు మధ్యాహ్నం అన్న క్యాంటీన్‌లో భోజనం చేయవచ్చు. గత టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్ ద్వారా రూ.5కే భోజనం చేసేవాడిని. గ్రామీణ ప్రాంతాల నుంచి తాపీమేస్త్రీ, చేనేత కూలిమగ్గం పనులకు వచ్చేవారికి అన్న క్యాంటీన్ ఎంతగానో ఉపయోగపడనుంది.

ఎంతో ఉపయోగం: షంషాద్‌బీ, ధర్మవరం



గత టీడీపీ హయాంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లో పేదలు ఎందరో కడుపునిండా అన్నం తినేవారం. ప్రభుత్వం.. గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకుని పట్టణాల్లో అన్న క్యాంటీన్లు ఉపయోగకరంగా ఉండేవి. వైసీపీ పుణ్యమా అని అన్న క్యాంటీన్లను మూసివేశారు. ప్రస్తుతం మళ్లీ అన్నక్యాంటీన్ల ద్వారా పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలనుకోవడం చాలా మంచి పరిణామం.

అన్నదాతకు అన్నివిధాలా నష్టం

ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



పంటను పరిశీలిస్తున్న సీపీఐ రామకృష్ణ, నేతలు

బత్తలపల్లి, ఆగస్టు 5: రైతులు అన్నివిధాలా నష్టపోయారనీ, ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. మండలకేంద్రం సమీపంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా దెబ్బతిన్న పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం పారంభంలో కురిసిన వానలకు కొంద రు రైతులు పంటలు సాగు చేశారన్నారు. ప్రస్తుతం వానల్లేక పంటలు దెబ్బతింటున్నాయన్నారు. అప్పులు చేసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న వారు చాలామంది పంట సాగు చేయలేదన్నారు. దీంతో వారు నష్టపోయారన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కూలీలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమలోని మంత్రులు, ఎమ్మెల్యేలు.. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి, వారికి ధైర్యం చెప్పాలని కోరారు. వెంటనే రైతులకు పెట్టుబడి సాయం అందించి, ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలోని జలాశయాలన్నీ నిండుకుండల్లా ఉన్నాయనీ, రాయలసీమలోని చెరువులు, కుంటలకు కాలువల ద్వారా నీరివ్వాలన్నారు. బత్తలపల్లి పరిధిలోని నిడిమామిడి జంగం మఠం భూమిలో గుడిసెలు వెసుకున్నవారిని తీసుకెళ్లి విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలుస్తామన్నారు. న్యాయం చేయాలని కోరతామన్నారు. కార్యక్రమములో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగదీష్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు జాఫర్, వేమయ్య, నాయకులు కాటమయ్య, మల్లికార్జున, కమతం కాటమయ్య, నారాయణస్వామి, రాజారెడ్డి పాల్గొన్నారు.

మామూళ్లమ్మ..!



మేడమ్‌కు ప్రతినెలా ముడుపులు వెళ్లాల్సిందే

ఇవ్వకపోతే తనిఖీలతో వేధింపులు

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇష్టారాజ్యం

యథేచ్ఛగా వసూలు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు



గత ఏడాది రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఏసీబీ అధికారులు

అనంతపురం క్రైం, ఆగస్టు 5: ప్రభుత్వ శాఖల్లో ఎక్కువగా అవినీతి జరిగే అవకాశమున్న శాఖల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ప్రతి రోజూ సాయంత్రం ఓ మేస్త్రీ కూలీలకు పంచినట్లు పైసలు పంపకాలు చేస్తారనే విమర్శలున్నాయి. ఈసీల దగ్గర నుంచి 08 భూముల వరకు అంతటా అవినీతే. సాధారణ రిజిస్ట్రేషన్‌కు సైతం డబ్బులు ఇవ్వాల్సిందే. డాక్యుమెంట్ రైటర్లు ఇందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంటారు. ప్రతి డాక్యుమెంట్‌కు రేటు కట్టి క్రయ, విక్రయదారులతో వసూలు చేస్తారు. సబ్‌రిజిస్ట్రార్లకు సైతం అందులోనే వాటా ఉంటుంది. ఇవన్నీ ఇలా జరిగిపోతుంటే.. ఉన్నతాధికారులకు సైతం ప్రతి నెలా చాలా పద్ధతిగా మామూళ్లు చేరిపోతుంటాయి. జిల్లా ఉన్నతాధికారిగా ఉన్న ఓ మేడమ్ ఈ విషయంలో చాలా స్ట్రిక్టుగా ఉంటారు. మేడమ్‌కు తప్పనిసరిగా ప్రతి నెలా మామూళ్ల వాటా వెళ్లాల్సిందే. మేడమ్ ఆగ్రహం వ్యక్తం చేశారా..? అంతే సంగతులు. శ్రీసత్యసాయి జిల్లా స్థాయి ఉన్నతాధికారిగా ఉన్న మరో మేడమ్ సైతం ఇదే స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులే ఇలా ఉంటే.. కిందిస్థాయిలో ఇక చెప్పేదేముంది.

రూ. లక్ష.. యాభై.. పాతిక

అనంతపురం జిల్లాలో 12, శ్రీసత్యసాయి జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో అధిక డాక్యుమెంట్లు జరిగేది అనంతపురం, అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే. ఈ సీట్లకు డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. ప్రతి నెలా ఈ రెండు కార్యాలయాల నుంచి మేడమ్‌కు రూ.లక్ష చొప్పున వెళ్లాల్సిందే. కొన్ని సందర్భాల్లో రూ.1.50 లక్ష కూడా ఉండొచ్చట. ఇక ధర్మవరం, తాడిపత్రి, రాయదుర్గం, కదిరి, హిందూపురం, గుంతకల్లు, పెనుకొండ లాంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రతి నెలా కనీసం రూ.50వేలు తప్పనిసరి అని సమాచారం. చిన్నస్థాయి రిజిస్ట్రేషన్ కార్యాలయాలైన శింగనమల, చెన్నేకొత్తపల్లి, కణేకల్లు, కళ్యాణదుర్గం లాంటి కార్యాలయాల నుంచి రూ.25వేలు ఉండాల్సిందేని తెలుస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఆ మేడమ్‌కు సైతం అందులో కొంత శాతం తగ్గించి నెల మామూళ్లు వెళ్తాయి.

ఇవ్వకపోతే తనిఖీలు

రిజిస్ట్రేషన్ శాఖకు ఆ మహిళా అధికారి వచ్చి నాలుగేళ్లవుతోంది. 2020లో వచ్చిన ఆ మేడమ్ 2022లో జూన్ నెల మాత్రమే బదిలీపై వెళ్లారు. ఆ వెంటనే తిరిగొచ్చారు. మేడమ్‌కు నెలనెలా అమ్యామ్యాలు అందకపోతే కథ చాలానే ఉంటుంది. సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తారు. వివాదాస్పద భూములు ఎలా రిజిస్ట్రేషన్ చేశారంటూ గట్టిగా నిలదీస్తారు. దీంతో ఆ తలనొప్పి తమకెందుకంటూ వచ్చిన మొత్తంలో ఆ మేడమ్‌కు వాటాలు ఇచ్చేస్తారని సమాచారం. మామూళ్ల విషయంలో సరిగా స్పందించకపోతే వివాదాలు వచ్చిన సమయంలో బదిలీలు అవలీలగా జరిగిపోతాయనే ప్రచారముంది. తప్పనిసరి బదిలీల్లో సేఫ్‌గా ఉండే సీట్లో కూర్చోబెట్టేందుకు మేడమ్ ఆశీస్సులు ఉంటాయనే మామూళ్లు వెళ్తాయని సమాచారం. గతంలో కర్నూలులో పనిచేసిన సమయంలో ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. అప్పట్లో పెద్ద స్థాయిలోనే సిఫార్సులు నడిపినట్లు సమాచారం. చాలా అత్యవసర పరిస్థితుల్లో (మెటర్నిటీ) కూడా పూర్తిస్థాయిలో సెలవు తీసుకోలేదంటే ఆ మేడమ్‌కు నెల మామూళ్లపై ఎంత మమకారమో చెప్పనవసరం లేదు.

అక్కడ ఇవ్వాలంటే ఇక్కడ నొక్కాలి

అక్కడ ఇవ్వాలంటే ఇక్కడ నొక్కాలిగా అంటున్నారట సబ్‌రిజిస్ట్రార్లు. సజావుగా జరిగే ప్రతి రిజిస్ట్రేషన్‌కు రూ.500 నేరుగా సబ్‌రిజిస్ట్రార్‌కు చేరిపోతుందని సమాచారం. ప్రతి రోజు ఎన్ని డాక్యుమెంట్లు అయితే అన్ని రూ.500లే. ఏదైనా తిరకాసుంటే ఆ లెక్క వేరే ఉంటుంది. అనంతపురం పరిధిలో గత నాలుగేళ్లలో చుక్కల భూముల రిజిస్ట్రేషన్లు బాగానే జరిగాయి. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఎకరాకు రూ.లక్ష పైమాటే వసూలు చేసినట్లు సమాచారం. ప్రస్తుతమూ అదే స్థాయిలో వ్యవహారం నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని భూములకు ఎమ్మెల్యేలు బ్రేక్ వేయడంతో ఆదాయం కొంత తగ్గినట్లు తెలుస్తోంది. 2023 జూలై 6న అనంతపురం రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరిగాయి. ఓ భవనం కోసం రూ.2లక్షలు డిమాండ్ చేయడంతో.. సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణ, డాక్యుమెంట్ రైటర్, అతని అసిస్టెంట్ దొరికారు. ఈ సమయంలో ఆ సబ్‌రిజిస్ట్రార్ డైరీలో జిల్లా అధికారులకెలా మామూళ్లు ఎంతెంతివ్వాలో రాసుకున్నారనే ప్రచారం జరిగింది. ఆ తరువాత అనంతపురం రూరల్‌లో మహబూబ్ అలీ మేనల్లుడు డబ్బు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. శ్రీసత్యసాయి జిల్లాలో బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌దీ అదే పరిస్థితి. ఆ తరువాత ఆయన చెన్నైలో ఆత్మహత్య చేసుకున్నారు.





ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, సవిత

ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరిస్తాం: కాలవ



కణేకల్లు చెరువులో గంగపూజ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, ఆగస్టు 5: హెచ్చెల్సీ ఆయకట్టు భూములకు ఈ ఏడాది పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసి రైతులకు ఇబ్బందిలేకుండా చూస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువులో సోమవారం గంగపూజ చేసిన ఆయన నూతనంగా నిర్మించిన కల్వర్టును కూడా ప్రారంభించి మాట్లాడారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో తుంగభద్ర డ్యాంలో కావాల్సినంత నీరు ఉందన్నారు. తద్వారా రైతులు పూర్తిస్థాయిలో పంటలు పండించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. టీబీ డ్యాంలో 99 టీఎంసీల నీటి నిల్వ ఉండటంతో ఆంధ్ర సరిహద్దు హెచ్చెల్సీలో 1400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని, దానిని 1600 క్యూసెక్కులకు పెంచనున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో వర్షాలు తగ్గుముఖం పడితే నీటి సరఫరా తగ్గిపోయే అవకాశం ఉన్నందున నీటి పొదుపును పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, కోకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, మాబుసాబ్, అనిల్ పాల్గొన్నారు.

సర్దుబాటుకు ముందే జీవో 117 రద్దు చేయాలి

అనంతపురం విద్య, ఆగస్టు 5: ఉపాధ్యాయుల సర్దుబాటుకు ముందే జీవో 117ను రద్దు చేయాలని ఆప్టా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకట రత్నం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్) సమాచారం సేకరిస్తోందన్నారు. ఇది టీచర్ల సర్దుబాటు కోసమే అంటూ ఉపాధ్యాయులు భావిస్తున్నారని, దీనిపై విద్యా శాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్నారు. పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ జీవో 117 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని ఉపాధ్యాయులు భావిస్తున్నట్లు తెలిపారు. జీవో 117 వల్ల ప్రాథమిక పాఠశాలలు చాలా వరకూ మూతపడే పరిస్థితి ఉందని, ఇది కొనసాగితే దాని ప్రభావం ఉన్నత పాఠశాలలపై పడుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అసంబద్ధమైన జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు.

చీనీ టన్ను రూ.17వేలు



అనంతపురం రూరల్, ఆగస్టు 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17,150, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.11,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 710 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.23



అనంతపురం రూరల్, ఆగస్టు 5: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 2600టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.12 పలికినట్లు ఆయన తెలిపారు.

విజయ డెయిరీ ద్వారా రైతులను ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 5: విజయ డైరీ ద్వారా పాడి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల నుంచి పాల సేకరణకు గత ప్రభుత్వం అమూల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈనెల 10 నుంచి రద్దు చేయనుంది. దీంతో పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఈరకమైన నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. మన జిల్లాలో వందకు పైగా కేంద్రాల ద్వారా పాల సేకరణ చేయాలని అమూల్ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుని ఏడు కేంద్రాల ద్వారా పాలు సేకరిస్తోందని, ఇలా సేకరించిన పాలల్లో ప్రతిరోజు దాదాపు 60వేల లీటర్లు రాయలసీమ జిల్లాల్లోని అంగన్వాడీ కేంద్రాలకు పంపుతున్నారన్నారు. అమూల్ కంపెనీతో ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంతో అంగన్వాడీ కేంద్రాలకు కర్ణాటక నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వార్తలొస్తున్నాయని, ఇది పాడిరైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఇప్పటికే పశువుల ధరలతోపాటు దానా, గడ్డి, పశువుల వైద్యం ఖర్చులు పెరిగి పాడిరైతులు నష్టాల్లో ఉన్నారన్నారనీ, కాబట్టి ప్రభుత్వం విజయ డెయిరీ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, పాలను సేకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం, ఆగస్టు 5: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి సోమవారం తీర్పునిచ్చారు. పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన తపిల రామాంజినేయులు 2020 మే 8న అదే మండలంలోని మరో గ్రామంలో నేరానికి పాల్పడ్డాడు. ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బ్లేడు, కత్తిపీటతో ఆ బాలిక గొంతు కోశాడు. అప్పటి పెద్దవడుగూరు ఏఎస్ఐ నారాయణ నాయక్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రవిశంకర్‌రెడ్డి చార్జిషీట్ దాఖలు చేశారు. శిక్ష పడేలా చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తుంగభద్ర జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్, ఆగస్టు 5: తుంగభద్ర జలాశయానికి సోమవారం ఇన్‌ఫ్లో తగ్గింది. సాయంత్రానికి 100.410 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం 1,32,202 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 82,780 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో 12 క్రస్ట్‌గేట్లు రెండు అడుగులు ఎత్తి ఈహెచ్‌ఈ, కాలువలకు మొత్తంగా 50,156 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దులోని 105 కి.మీ. వద్ద 1360 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. .

మొదలైన దాడి

- వేరుశనగలో తెగుళ్ల ఉధృతి
- ఆందోళనలో అన్నదాతలు



తెగుళ్లబారిన పడిన వేరుశనగ పంట, (ఇన్‌సెట్‌లో) వేరుశనగ మొక్కను ఆశించిన పురుగులు

ధర్మవరంరూరల్, ఆగస్టు5: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకు అప్పుడే తెగుళ్ల దాడి మొదలైంది. ఒకేసారి పలు రకాల తెగుళ్లు దాడిచేయడంతో పంట వృద్ధి చెందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నాలుదు వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. పంట సాగుచేసి దాదాపు 20 నుంచి 25రోజులు కావొస్తోంది. ప్రస్తుతం పంటకు ఆకుపచ్చపురుగు, ఆకుముడత, లద్దెపురుగు ఆశించాయి. ఆకులపై తెల్లమచ్చలు ఏర్పడటంతో పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. ఆకుపచ్చ పురుగుతో ఆకులన్నీ రంధ్రాలు పడినట్లు రైతులు పేర్కొంటున్నారు. వేరుశనగకు ఆదిలోనే తెగళ్లు ఆశించడంతో రైతులు రసాయనిక మందులు పిచికారీ చేస్తున్నారు. అయితే వాతావరణ మార్పులతో ఆ మందులు పనిచేయడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలకు వేలు వెచ్చించి మందులు పిచికారి చేసినా తెగుళ్ల నుంచి విముక్తి కలగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ సాగుకు ఎకరాకు 20వేల వరకు పెట్టుబడి పెట్టామని, తెగుళ్ల బెడదతో ఏమాత్రం పంట చేతికొస్తుందో అంతుబట్టడం లేదని రైతులు వాపోతున్నారు.

మందులు పిచికారీ చేయాలి: ముస్తఫా, ఏఓ, ధర్మవరం



వేరుశనగలో తెగుళ్లను సకాలంలో గుర్తించి మందులను పిచికారీ చేసుకోవాలి. పచ్చపురుగు, లద్దెపురుగు నివారణకు ప్రొఫినోపాస్ 2ఎంల్, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకుముడ త, రసంపీల్చే పురుగుల నివారణకు కాన్ఫిడార్ 1ఎంల్, లీటర్‌నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పూత దశలో ఉన్న వేరుశనగకు ఎకరాకు 200కేజీల జిప్సం వేసు కుంటే నాణ్యమైన దిగుబడి, విత్తనంలో నూనె శాతం పెరుగుతుంది.

నేల తల్లికి పచ్చ బొట్లు

హెచ్చెల్సీ ఆయకట్టు కింద జోరుగా వరినాట్లు



దేవగిరి క్రాస్ సమీపంలో నాట్లు వేస్తున్న కూలీలు

బొమ్మనహాళ్, ఆగస్టు 5: మండలంలో ఖరీఫ్ వరినాట్లు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో బోరునీటి సౌకర్యం ఉన్న రైతులు నాట్లు ప్రారంభించారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి సాగునీరు విడుదలైన నేపథ్యంలో కాలువలో సమృద్ధిగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కాల్వలు, బోర్ల కింద వరినాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని ఉంతకల్లు, రంగాపురం క్యాంప్, దేవగిరి క్రాస్ తదితర గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. ఈ వారంలో వర్షాలు మరింతగా కురిస్తే తొలకరి వరినాట్లు మరింత వేగం పుంజుకుంటాయి. హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలు రావడంతో ఉత్సాహంతో సాగు పనులు ప్రారంభించారు. దీంతో పంట పొలాలన్నీ రైతులు, కూలీలతో కళకళలాడుతున్నాయి.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు సాయం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 5: ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం సాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మండలంలోని మన్నీల గ్రామ సమీపంలో వర్షాలు లేక దెబ్బతింటున్న పంటలను సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఉత్తరాది రాష్ట్రాలు, కేరళలో తుపానులతో జనాలు బెంబేలెత్తుతున్నారన్నారు. రాయలసీమలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షాలు కురవకపోవడంతో పంట సాగు చేయని పరిస్థితులున్నాయన్నారు. సాగు చేసిన పంటలు వర్షాభావ పరిస్థితుల కారణంగా దెబ్బతింటున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చెప్పిన విధంగా రైతులకు రూ.20వేలు ఇవ్వాలన్నారు. వెంటనే 90శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందించాలన్నారు. తుంగభద్ర, శ్రీశైలం డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నాయి కావున హంద్రీనీవా కెనాల్, పీఏబీఆర్ కెనాల్‌కి పూర్తి స్థాయిలో నీటినందించి చెరువులను నింపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్, నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, రామకృష్ణ, రైతు సంఘం నాయకులు బుల్లె నగేష్, వెంకటనారాముడు, చిన్న వెంకటరాముడు, శివ, ఆంజనేయులు, నిరంజన్ పాల్గొన్నారు.

నేడు ఆర్‌జేడీ సమీక్ష

అనంతపురం విద్య, ఆగస్టు 5: పాఠశాల విద్యాశాఖ కడప ఆర్‌జేడీ శామ్యూల్ మంగళవారం జిల్లాకు రానున్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాల డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు 1-,2లతో నగర శివారులోని ఆర్డీటీ ఆడిటోరియంలో మంగళవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించనున్నారు. రెండు జిల్లాల అధికారులు ఈ సమీక్షకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు విద్యాశాఖ అంశాలపై వారితో సమీక్ష నిర్వహిస్తారని జిల్లా అధికారులు తెలిపారు.

మిర్చి రైతు కష్టం దొంగలపాలు

- పంట అమ్మిన సొమ్మును చోరీ చేసిన దుండగులు
- ద్విచక్రవాహనం బ్యాగులో ఉంచిన రూ.3.5 లక్షలు అపహరణ
- ఉరవకొండలో పట్టపగలే చోరీ



చోరీ వివరాలను వెల్లడిస్తున్న బాధితుడు

ఉరవకొండ, ఆగస్టు 5: పట్టణంలోని గవిమఠం ఆవరణలో ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.3.5 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. విడపనకల్లు మండలం ఉండబండకు చెందిన రైతు వేణుకు ఉరవకొండలోని ఎస్‌బీఐ ఖాతాలో మిర్చి పంటకు సంబంధించిన డబ్బు జమ అయ్యాయి. వాటిని డ్రా చేసుకునేందుకు సోమవారం బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకులో బంగారంపై ఉన్న రుణాన్ని చెల్లించి, మిగిలిన రూ.3.5 లక్షలు డ్రా చేసుకుని, ద్విచక్రవాహనం బ్యాగులో ఉంచాడు. అక్కడి నుంచి గవిమఠం ఆవరణలో ఆయన తల్లిదండ్రులు బీరువా ఆర్డర్ ఇస్తుండగా అక్కడకు వెళ్లాడు. ద్విచక్రవాహనాన్ని బయట ఆపి కుటుంబసభ్యులతోపాటు లోపలికి వెళ్లాడు. బయటకు వచ్చి ద్విచక్రవాహనానికి ఉన్న బ్యాగుని చూడగా అందులో ఉన్న డబ్బు మాయమైంది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమివ్వగా.. వారు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. సమీపంలో ఉన్న దుకాణాలలోని సీసీ ఫుటేజీ ద్వారా దొంగలను గుర్తించే ప్రయత్నాలు చేశారు. ముగ్గురు వ్యక్తులు వెంబడించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు.

దోపిడీయే వారి పని

- ఏటీఎంలను కొల్లగొట్టడమే లక్ష్యం
- చోరీల్లో ప్రత్యేక శిక్షణ
- రెండు నెలల్లో జిల్లాలో మూడు ఘటనలు
- హరియాణా మేవాత్‌వాసుల పనే
- రికవరీ ఆషామాషీ కాదట..!



అనంతపురం క్రైం, ఆగస్టు 5: ఆ ఊరివాళ్లంతా ఏటీఎంల దోపిడీయే లక్ష్యంగా పని చేస్తున్నారు. గ్యాస్ కట్టర్‌లతో చాకచక్యంగా ఏటీఎంలను కట్ చేసి అందులో ఉన్న సొమ్మంతా దోపిడీ చేస్తున్నారు. వీరు సాధారణంగా పెద్ద మొత్తంలో డబ్బు ఉంచే ఏటీఎంలనే టార్గెట్ చేస్తారు. ఇందుకు వారికి ప్రత్యేక శిక్షణ సైతం ఇస్తారు. ఇదంతా హరియాణా రాష్ట్రంలోని మేవాత్ ప్రాంతంలో జరిగే వ్యవహారం. ఇక్కడి యువకులు కొంతమంది ఇతర రాష్ట్రాల కు వెళ్లి ఎస్‌బీఐ లాంటి ప్రధాన బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలను కొల్లగొట్టి అక్కడి నుంచి క్షణాల్లో ఉడాయిస్తారు. జిల్లా పోలీసులకు ఈ దొంగల వ్యవహారం తలనొప్పిగా మారింది. గతం లో హవాలా మనీ దొంగిలించిన కేరళ వారిని పట్టుకోవడానికి జిల్లా పోలీసులు నానా తిప్పలు పడ్డారు. ఇప్పుడు హరియాణాకు వెళ్లినా ఆ దొంగల నుంచి డబ్బు రికవరీ అంత ఈజీ కాదని తెలుస్తోంది. పోలీసుల విచారణలో ఇవన్నీ నిందితులే చెప్పినట్లు తెలిసింది.

రెండు నెలల్లో మూడు ఘటనలు

ఇటీవల జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కత్తరించి రూ.30లక్షలు ఎత్తుకెళ్లిన ఘటన కలకలం రేపింది. ఇలాంటి ఘటనలు మరో రెండు జరిగాయి. ఈనెల 2న తెల్లవారుజామున గార్లదిన్నె మండలం కల్లూరులో ఎస్‌బీఐ ఏటీఎంను ఇదే రీతిలో కొల్లగొట్టారు. రూ.3.28లక్షలు ఎత్తుకెళ్లారు. కూడేరులో జూన్ 8 అర్ధరాత్రి ఏటీఎంలో చోరీ జరిగింది. అందులో నుంచి రూ.18,41,300లు ఎత్తుకెళ్లారు. మొత్తంగా రెండు నెలల్లోనే రూ.60లక్షల వరకు ఎత్తుకెళ్లారు. కల్లూరు, కూడేరు ఘటనల్లో ఇంకా దొంగలు దొరకనేలేదు. తాజాగా జరిగిన ఏటీఎం చోరీతో పాటు కల్లూరు, కూడేరు ఘటనల్లోనూ హరియాణాలోని మేవాత్ ప్రాంత వాసుల హస్తం ఉన్నట్లు తేలింది. ఐదేళ్ల క్రితం జేఎన్‌టీయూ సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకుకే కన్నం వేశారు. ఆ సందర్భంలో కేవలం కొంత మాత్రమే రికవరీ అయింది.

రికవరీ కష్టమేనట...

రామ్‌నగర్‌లోని ఏటీఎం చోరీచేసిన ఘటనలో పాల్గొన్న ముగ్గురు దొంగలు గంటల వ్యవధిలోనే కర్ణాటక రాష్ట్రంలోకి చేరుకున్నారు. డబ్బు తీసుకెళ్లడానికి కారు ఉపయోగించారు. వీరంతా వేర్వేరు బృందాలుగా ఉంటారని సమాచారం. కొందరు బెంగళూరు నుంచి నేరుగా విమానంలో వెళ్తారని సమాచారం. ఇక చోరీ చేసిన సొమ్మును రైలులో తరలిస్తారని తెలిసింది.

రామ్‌నగర్ ఏటీఎం దోపిడీ ఘటనలో పాల్గొన్న దొంగల్లో ఇద్దరు పట్టుబడ్డారు. అప్పటికే వారి నుంచి డబ్బు మాయమైంది. ఆ మూడో దొంగ ఆ డబ్బును మరో బృందానికి అందజేసినట్లు సమాచా రం. వారి నుంచి రికవరీ చేయడం ఆషామాషీ కాదని సమాచారం. పోలీసులకు పట్టుబడితే ఆ దొంగలు కట్టుకథలు చెబుతారని కానీ డబ్బు మాత్రం ఇవ్వరట. ఆ డబ్బు కాల్చేశామని, ఎక్కడో నీటి ప్రవాహంలో పడేశామని, ట్రైన్‌లో బ్యాగ్ మర్చిపోయామని చెబుతారట. ఇక కోర్టు పరిధిలో లీగల్‌గా పోలీసులకే తలనొప్పులు తెచ్చేలా వ్యవహరిస్తారని సమాచారం. ఆ దొంగల నుంచి రికవరీ చేయాలంటే పోలీసులకు తలపోటు తప్పదని తెలుస్తోంది. మరి మూడు చోరీలకు సంబంధించి రూ.60లక్షల రికవరీ చేయడం అనంత పోలీసులకు సవాలే.



ఇన్‌చార్జి ఎంపీడీఓతో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

తాగునీటి సమస్య పరిష్కరించండి

ధర్మవరం రూరల్, ఆగస్టు 5: పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్‌నబీ, ఆర్ డబ్ల్యూఎస్ జేఈ వరలక్ష్మిని టీడీపీ నాయకులు సోమవారం విజ్ఞప్తి చేశారు. తండాలో తాగు నీటికి కటకట, అవస్థలు పడుతున్న గ్రామస్థులు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి స్పందించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్.. సమస్యపై అధికారులతో చర్చించి.. పరిష్కరించాలని పార్టీ నాయకులను ఆదేశించారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే తన సొంత ఖర్చులతో తాగునీటి సమస్యను పరిష్క రిస్తానని చెప్పారు. దీంతో టీడీపీ నాయకులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో నడిమిగడ్డపల్లి తూర్పుతండా, బలిజమల తండా, తుంపర్తికాలనీ, బుడ్డారెడ్డిపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇందులో టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, మండల ప్రధాన కార్యదర్శి విజయ్ సారథిచౌదరి, రామ్మోహన్, సూర్యనారాయణ, జంగం నరసింహులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో తాగునీటి సమస్య

ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసిన టీడీపీ నేత తుమ్మల మనోహర్



తాగునీటిని సరఫరా చేస్తున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్

ముదిగుబ్బ, ఆగస్టు 5 : స్థానిక ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో మూడు రోజుల క్రితం తాగునీటి బోరు చెడిపోయింది. దీంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు విషయాన్ని తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎంఈఓ రమణప్పతో కలిసి సోమవారం బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. బోరు రిపేరీ అయ్యే వరకు ట్యాంక్ ద్వారా సొంత నిధులతో నీళ్ల సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, ఎంఈఓ రమణప్ప, చంద్రసేన, ఫిరోజ్, గాజుల చంద్ర, అబ్దుల్లా పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



సమస్యలపై ఆరా తీస్తున్న ఎంపీపీ, బీజేపీ నాయకులు

ముదిగుబ్బ, ఆగస్టు 5 : కొండగట్టుపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, బీజేపీ నాయకులు భరోసా ఇచ్చారు. సోమవారం వారు ఆ గ్రామంలో పర్యటించారు. సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో రెండు తాగునీటి బోర్లు ఉండగా.. ఒక్క బోరే పని చేస్తోందని, దీంతో తాగునీటి సమస్య ఏర్పడిందని ఆ గ్రామస్థులు వాపోయారు. సత్యసాయి తాగునీరు కూడా గ్రామానికి సరఫరా కావడం లేదని తెలిపారు. నాలుగు రోజుల్లో తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు. పాఠశాల వద్ద ఉన్న బోరుకు మరమ్మతులు చేయించి.. చేతిపంపు ఏర్పాటు చేస్తామని, మరో కొత్త బోరు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, డీఈ శాంతన్న, ఈఓఆర్‌డీ కృష్ణ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధర్మవరం, ఆగస్టు 5: స్థానిక తారకరామాపురానికి చెందిన మాదాపురం మహేశ్ ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం గౌడ్, 40వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి అశోక్ మృతుడు మహేశ్ తల్లి రాజేశ్వరిని సోమవారం పరామర్శించారు. వారి వెంట బూత్ కన్వీనర్‌లు, కమిటీ సభ్యులు, సెక్షన్ ఇన్‌చార్జి ఉన్నారు.

ఆర్థిక సాయం

ధర్మవరం, ఆగస్టు 5: స్థానిక 40వ వార్డులో డయాలసిస్‌తో బాధపడుతున్న మెకానిక్ బాబును బీజేపీ నాయకులు హరీశ్, మల్లికార్జున, మిరియాల అంజి సోమవారం పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా 27వ వార్డులో బద్రిప్రసాద్ అనారోగ్యంతో మరణించడంతో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కదిరి అర్బన్, ఆగస్టు 5: మండలంలోని కాళసముద్రం పాఠశాలలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ త్రిమూర్తి, ఆదిబయ్యన్న, రాజశేఖర్, రమణారెడ్డి, సయ్యద్‌బాషా, చలపతి, ఉషారాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ఎస్‌టీయూ..

బుక్కపట్నం : మండలంలోని నారసింహపల్లి, తండా పాఠశాలల్లో ఎస్‌టీయూ నాయకులు సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్, నాయకులు సుధాకర్, అనీల్ కుమార్, సత్యనారాయణరెడ్డి, ఓబులపతి, ప్రమీలమ్మ, అస్మబేగం, తేజశ్వని పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై సామాజిక తనిఖీ

గాండ్లపెంట, ఆగస్టు 5: మండలం 2023-24లో ఉపాధి పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేపట్టిన ఉపాధి పనులు, పంచాయతీ రాజ్ పనులు, సామాజిక పింఛన్ పనులను తనిఖీ చేస్తున్నారన్నారన్నారు. ఆయా గ్రామాల్లో సామాజిక బృందాలకు సహకరించాలన్నారు. వారికి కావలసిన సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మంజునాథ్, ఎస్ఆర్‌పీ తిరుమలేష్, పంచాయతీరాజ్ జేఈ రెడ్డివరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

బుక్కపట్నం, ఆగస్టు 5: మండలంలోని నారసింహపల్లి, తండాల్లోని పాఠశాలలో విద్యార్థులకు పుట్టపర్తికి చెందిన బిల్డర్ నారాయణప్ప, అతని కుమారుడు మహేష్ రూ. 50 వేల విలువైన విద్యాసామగ్రిని సోమవారం పంపిణీచేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, వాష్‌రూమ్ కిట్లు తదితర వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రమీలమ్మ, ఉపాధ్యాయులు, బీజేపీ నేత లాయర్ హరిక్రిష్ణ, టీడీపీ నాయకుడు సునీల్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రిని అందజేసిన దాతలు

చిగురిస్తున్న సొంతింటి ఆశ

కూటమి ప్రభుత్వంపై పేద, మధ్యతరగతి ప్రజల విశ్వాసం

నంబులపూలకుంట, ఆగస్టు 5 : సొంతింటి కోసం పేద, మధ్య తరగతి ప్రజలు ఐదేళ్ల పాటు నిరీక్షించి.. విసిగిపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి ఆశలు మళ్లీ చిగురించాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ గృహాలను లబ్ధిదారులు సకాలంలో నిర్మించు కోలేక పోయారు. కొంతమంది ఎన్టీఆర్ ఇళ్లను అప్పులు చేసి నిర్మించుకున్నారు. మరికొంత మంది మొండిగోడల వరకు పూర్తి చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో వాటి నిర్మాణాలు ఆగిపోయాయి. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వ హయంలో ఇసుక ధర భారీగా పెరగడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ఆపేశారు. వైసీపీ పాలన ఐదేళ్లలో 124 ఇళ్లు మంజూరు కాగా, వీటిలో 51 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 20 ఇళ్లు వివిధ దశలో ఉన్నాయి. బిల్లులు సరిగా రాకపోవడం.. సౌకర్యాలు లేని చోట ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో అనేక మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి చూపలేదు. ఇటీవల



బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిలిచిపోయిన ఎన్టీఆర్ గృహ నిర్మాణం

అధికారం చేపట్టిన కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2014-19లో ఎన్టీఆర్ ఇళ్లు నిర్మించుకున్న, అర్ధాంతంగా నిర్మాణాలు ఆగిపోయిన ఇళ్లకు బిల్లులు ఇస్తామని ప్రకటించింది. అంతేకాకుండా ఇక ఇంటి నిర్మాణాకి రూ.నాలుగు లక్షలు మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. పైగా ప్రస్తుతం ఇసుక ఉచితంగా లభిస్తుండడంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకొంటున్నారు. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి మళ్లీ మొగ్గు చూపుతున్నారు.



వైసీపీ హయాంలో బిల్లులు ఇవ్వలేదు

ఎన్టీఆర్ ఇళ్లు నా కోడలు నీలావతి పేరుతో మంజూరైంది. రూ.14 వేలు పునాది బిల్లులిచ్చారు. గోడల వరకూ నిర్మించుకున్నాం. అప్పులు చేసి, గోడల వరకు నిర్మించుకున్నాం. ప్రభుత్వం మారింది. బిల్లులు వస్తాయని ఎదురు చూశాం. ఐదేళ్లు మొండిగోడలకే పరిమి తమైంది. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వడంతో మా కల నేరువేరతోంది. మాకు కూడా ప్రస్తుతం ప్రకటించిన రూ.నాలుగు లక్షలు మంజూరు చేస్తే కష్టాలు తీరుతాయి.

- అరుణమ్మ, అంబేద్కర్‌నగర్, ఎన్పీ కుంట

ఇంటి నిర్మాణం పూర్తి చేస్తాం



గత టీడీపీ పాలనలో ఎన్టీఆర్ ఇళ్లు మంజూరైంది. మూడో దశ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్నాం. తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వం మాకు ఎలాంటి బిల్లులూ ఇవ్వకపోవడంతో నిర్మాణం ఆగిపోయింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటాం.

- నిర్మలమ్మ, ధనియాన్ చెరువు

ఉత్తర్వులు వస్తే సర్వే చేస్తాం

ప్రభుత్వం నుంచి తమకు ఉత్తర్వులు రాలేదు. అవి వచ్చిన వెంటనే 2014-19 ఎన్టీఆర్ ఇళ్లపై సర్వే చేస్తాం. నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి అందచేస్తాం.

-శ్రావణి, హౌసింగ్ ఏఈ, ఎన్పీ కుంట

రైతు సమస్యలపై సీపీఐ ఆందోళన



ముదిగుబ్బ డిప్యూటీ తహసీల్దార్, తనకల్లులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

ముదిగుబ్బ, ఆగస్టు 5 : సీపీఐ, రైతు సంఘం జిల్లా కమిటీ ఆదేశాల మేరకు రైతు సమస్యలపై స్థానిక సీపీఐ నాయకులు, రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సీఎస్ డీటీ మునిస్వామికి వినతి పత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈ ఏడాది మండలంలో 20 శాతం కూడా వేరుశనగ పంట సాగు చేయలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులకు 100 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. తెలంగాణాలో మాదిరి ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని, 2014టీడీపీ ప్రభుత్వంలో మాదిరి బిందు సేద్యం పరిక రాలను సబ్సిడీతో రైతులకు విరివిగా మంజూరు చేయాలని అన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిప్పయ్య, రైతు సంఘం నాయకులు తుమ్మల చిన్నప్ప, రాధాకృష్ణ, సింగర య్య, రామాంజి, దేవేందర్‌నాయక్ పాల్గొన్నారు.

తనకల్లు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం సీపీఐ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. కార్యాలయం ముందు బైఠాయించి, నినాదాలు చేశారు. తీవ్ర వర్షాభావం వలన రైతులు పంటలు సాగుచేయలేకపోయారన్నారు. ప్రస్తుతం వేరుశనగ, ఇతర పంటలు వేయడానికి అదును దాటిపోయిందన్నారు. అందువలన ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలు అందించాలన్నారు. ఉచితంగా రైతులకు విత్తనాలు, చిరుధాన్యాలు అందించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, ఏపీ రైతు సంఘం కరీముల్లాబాషా, కమిటీ సభ్యులు రామకుమార్, ఆనంద్, గంగన్న, రమణప్ప, రవి, పలువురు రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లకార్జునకు సోమవారం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుచ్చెపు చంద్ర, సీపీఐ గంగాధర్ వినతిపత్రం అందించారు. ప్రస్తుతం వేరుశ నగ, ఇతర పంటలు వేయడానికి అదును దాటిపోయిందని, అందువల్ల ప్రభుత్వం ప్రత్యా మ్నాయ విత్తనాలు అందించాలని కోరారు. ఉచితంగా రైతులకు విత్తనాలు, చిరుధాన్యాలు అందించాలన్నారు.

విద్యార్థిని చితకబాదిన ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్

విద్యాశాఖమంత్రి, అధికారులకు తండ్రి ఫిర్యాదు

తనకల్లు, ఆగస్టు 5 : మండలంలోని కొక్కంటి క్రాస్‌కు చెందిన చిన్నారి మహమ్మద్ యాసిన్ అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువులోని ఎస్‌వీవీబీ (శ్రీపోతులూరి వీరబ్రహేంద్రస్వామి) పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆ పాఠశాల నిర్వహించే హాస్టల్లోనే ఉంటున్నాడు.



దెబ్బలను చూపుతున్న మహమ్మద్ యాసిన్

ఈనెల 2న సాయంత్రం విద్యార్థులు ఆడుకుంటుండగా అక్కడికి వచ్చిన కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి మహమ్మద్‌యాసిన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచక్షణరహితంగా చితకబాది వెళ్లిపోయాడు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు చందాలు వేసుకుని జెండుబామ్ తెచ్చి దెబ్బలు తిన్న మహమ్మద్ యాసిన్‌కు సపర్యలు చేశారు. విషయం తెలుసుకున్న తండ్రి ఇక్బాల్ ఆదివారం ఆ పాఠశాలకు వెళ్లి కుమారుడ్ని ఇంటికి తీసుకునివచ్చాడు. తల్లిదండ్రులు తమహమ్మద్ యాసిన్ గాయాలకు కాపడం పెట్టి, డాక్టర్ వద్ద వైద్యం చేయించారు. అనంతరం ములకలచెరువు పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదని చెప్పారు. దీంతో తన బిడ్డకు జరిగిన సంఘటన ఇతర విద్యార్థులకు జరగకూడదనే ఉద్దేశంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేష్‌కు, ఉన్నతాధికారులకు వాట్సాప్, మెయిల్స్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఇక్బాల్ చెప్పారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

గాండ్లపెంట, ఆగస్టు 5: స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ క్రిష్ణానాయక్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 8న మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కమిటీ ఛైర్మన్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. కమిటీ ఎన్నికల్లో పిల్లల తల్లిదండ్రులతో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీనివాసులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిద్ధారెడ్డి, ఆదినారాయణ, హైదర్‌వలీ, రామమోహన్, ఎస్ఓ దుర్గా పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ 2 సురేష్‌బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. స్కూల్ కమిటీ ఛైర్మన్ ఎన్నికలను ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పాఠశాలాభివృద్ధికి ఈ కమిటీలు దోహదపడ్డాలన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కందికుంట

కదిరి: నియోజకవర్గ ప్రజల సమస్యలు తీర్చడానికి సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాల్లో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజాదర్బార్ నిర్వహించారు. అన్ని మండలాల ప్రజలు తమ సమస్యలు విన్నవించుకున్నారు. అధికారులతో మాట్లాడి ఆ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలుంటే ప్రజలు తమను నేరుగా కలవాలని ఎమ్మెల్యే తెలిపారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కందికుంట

దూరవిద్యకు దరఖాస్తు చేసుకోండి: జేసీ

పుట్టపర్తి, ఆగస్టు 5 : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జా యింట్ కలెక్టరు అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరెట్లో అందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. దూరవిద్యా విధానం ద్వారా చదువుకోవాలే ఆసక్తి ఉన్న వారు ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ప్రవేశానికి 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్ ప్రవేశానికి పదిపాసై 15 సంవత్సరాలు నిండి ఉండాలని అన్నారు. పూర్తి వివరాలు apopen school.pg.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి శివరంగప్రసాద్, ఓపన్‌స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్, లాజరు, సహాయసంచాలకులు నాగరాజు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ

వామ్మో దుర్వాసన

కదిరి, ఆగస్టు 5: తలుపుల తహసీల్దార్ కార్యాలయం సమీపం, ప్రభుత్వ ఆసుపత్రికి కూత వేత దూరంలో ఉన్న పాల కేంద్రం నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని ఆ చుట్టుపక్కల ప్రాంతాల వాసులు వాపోతున్నారు. కనీసం ఆ వీధులోకి వెళ్లాలంటేనే ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రికి వచ్చే రోగులు ఆ దుర్వాసన పీల్చుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆ పాల కేంద్రంలో పాల క్యాన్లు కడగిన నీరు ఓ గుంతలో నిల్వ ఉండేలా చేశారు. అయితే ఆ గుంతపై కేవలం బండలు వేసి వదిలేయడంతో.. ఆ నీరు మురిగి తీవ్ర దర్వాసన వస్తోంది. ఆ వాసన బయటకు రాకుండా ఆ బండలపై సిమెంట్ ప్లాస్టింగ్ చేసి.. దర్వాసన రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మురుగు వాసనకు కారణమైన గుంత

రహదారిలో గుంతల పూడ్చివేత

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 5: కదిరి, హిందూపురం ప్రధాన రహదారి గుంతలయమంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రధాన రహదారి గుంతలయం అన్నవార్తను ఇటీవల ప్రచురించింది. స్పందించిన అధికారులు మండలంలోని వడ్డివారిపల్లి వద్ద, మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ప్రధాన రహదారిపై సోమవారం గుంతలను తార్‌తో పూడ్చి మరమ్మతులు చేశారు.



కదిరి-హిందూపురం రహదారికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది, వడ్డివారిపల్లి వద్ద వేసిన తారు

ధర్మవరంలో చోరీ

ధర్మవరం, ఆగస్టు 5 : స్థానిక లక్ష్మీనగర్‌లో నివాసముంటున్న టీచర్ బాలాజీ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాలాజీ కుటుంబ సభ్యులతో హుబ్లీ వెళ్లాడు. ఇది గమనించిన దుండగులు ఆదివారం రాత్రి ఇంటి తాళాలు పగలకొట్టి లోపలికి ప్రవేశించి.. బీరువాలో ఉన్న రూ.22 వేలు నగదును అపహరించారు. సోమవారం ఉదయం చుట్టుపక్కల వారు ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్న దృశ్యాన్ని చూసి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి.. స్థానికుల ద్వారా ఇంటి యజమానికి చోరీ జరిగిన విషయాన్ని తెలియజేశారు. ఇంటి యజమాని మంగళవారం ధర్మవరం వస్తానని చెప్పారని, వారు వచ్చిన తరువాత ఇంకా ఏఏ వస్తువులు దొంగలించారో తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

టీచర్లకు పనిభారం తగ్గింపుపై హర్షం

కదిరి అర్బన్, ఆగస్టు 5: గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు ఆ పాఠశాలలోని మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే బాధ్యతల నుంచి ప్రస్తుత కూటమి ప్రభుత్వం విముక్తి కల్పించడంపై మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల ఆత్మ గౌరవానికి భంగం వాటిల్లికుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ

ముదిగుబ్బ, ఆగస్టు 5 : ముదిగుబ్బకు చెందిన వెంకటేష్ నాయక్ కుమారుడు గణేష్ నాయక్ నీట్ ఫలితాల్లో 720 మార్కులకు 651 మార్కులు సాధించాడు. ఎస్టీ క్యాటగిరిలో రాష్ట్ర స్థాయిలో ఐదవ ర్యాంక్, ఓపెన్ క్యాటగిరిలో 25,877 ర్యాంక్ సాధించాడు. గణేష్ నాయక్‌ను బంధువులు, స్థానికులు అభినందించారు.



గణేష్‌నాయక్

ఓడీసీ తహసీల్దార్‌గా అనంతాచారి



ఓబుళదేవరచెరువు, ఆగస్టు 5: మండల తహసీల్దార్‌గా అనంతాచారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఖజాబీ బదిలీ కావడంతో, సాధారణ బదిలీల్లో భాగంగా అనంతచారిని ఇక్కడికి బదిలీ చేశారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ జాకీర్, సీఎస్‌డీటీ రమాదేవి, ఇన్‌చార్జి ఆర్ఐ భరత్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, ఆర్ఎంపీ జాకీర్ శుభాకాంక్షలు తెలిపారు.

తుప్పుపడుతున్న వాహనాలు

ధర్మవరం రూరల్, ఆగస్టు 5 : వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన వాహనాలు, ప్రమాద సంఘటన స్థలాల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్రవా హనాలు, ఆటోలు, ఇతర వాహనాలు ధర్మవరం రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పడుతున్నా యి. ఈ వాహనాలపై పోలీసు అధికారులు స్పం దించి.. నిరుపయో గంగా ఉన్న వాటిని వేలం వేయా లని పలువురు కోరుతున్నారు.



రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో తుప్పుపడుతున్న ద్విచక్రవాహనాలు


ఎపీపీ షాపును ప్రారంభిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

కూటమి పాలనలోనే పేదల సంక్షేమం

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం

చిలమత్తూరు, ఆగస్టు 5: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమం అందుతుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు చోట్లలా న్యూస్ డిపోలను ఆయన ప్రారంభించి పేదలకు నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం సంక్షేమం ప్రచారం మాత్రమే జరిగిందని, అయితే కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవానికి సంక్షేమం అందుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు నిత్యావసరాలు సక్రమంగా అందుతాయన్నారు. ఈ సందర్భంగా పాతచామలపల్లి, కొత్తచామలపల్లి, చెరువుకిందపల్లి గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి దుకాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, జిల్లా కార్యదర్శి ఏవీ రమణ, మండల అధ్యక్షుడు చిన్న ప్రవీణ్, కొల్లకుంట శేఖర్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

హిందూపురం అర్బన్, ఆగస్టు 5: ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలను నిరసిస్తూ మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సప్తగిరి కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా హాస్టళ్లలో సమస్యలు పెరిగినా పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. ఎక్కువ తరుపు పాత భవనాల్లోనే విద్యార్థులు ఉంటున్నారని, అవి ఎప్పుడు కూలుతాయో తెలియదన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు కాస్మొటిక్, నట్టులు, , మెస్ చార్జీలు విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల్లో ఉన్న హాస్టళ్లకు సొంత భవనాల్లోకి మార్చాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దేవరాజు, నాయకులు మహేష్, నాగేంద్ర, వరుణ్, భార్గవ్ ఆదర్శ్, రాజేష్, వినయ్, రాకేష్ శివ తదితరులు ఉన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

● రైతు సంఘం డిమాండ్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, ఆగస్టు 5 : కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొండల్ని కూడా వదలకుండా కబ్జా చేస్తున్నారని, ప్రభుత్వ అధికారులు నోరు మెదపడంలేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పూజారప్ప మండిపడ్డారు. పట్టణ సమీపంలో ఉన్న కనుమలపల్లి సర్వేనంబరు 114లో 37ఎకరాల కొండను రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులు అక్రమంగా కబ్జా చేసి ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్నారన్నారు. ప్రకృతి సంపదను నాశనం చేసే రాక్షసు ఏ ఒక్కరికీ లేదని అధికారులు తక్షణమే అడ్డుకోవాలన్నారు. గుండ్లహళ్లి, పెండ్లిజీవి, నాగలమడక గ్రామాల్లో చెరువుల్లో మట్టి తొలగిస్తున్నారని వారిని అడ్డుకోవాలన్నారు. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వరదరాజులకు వినతిపత్రం అందించారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

● ఇబ్బందుల్లో ప్రయాణికులు


ఆర్అండ్‌బీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

గుడిబండ, ఆగస్టు 5: మండలంలోని మందలపల్లి రోడ్డులో కాసింత వర్షానికే రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండు సమీపంలోని రోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. వాహనదారులు గతంలో ప్రమాదానికి గురైన సందర్భాలూ ఉన్నాయని, అధికారులు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

గుడిబండ, ఆగస్టు 5: మండలంలోని కేకేపాళ్యం గ్రామంలో రహదారిని ఆక్రమించి, వాహనదారులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డికి స్థానికులు విన్నవించారు. కెకెపాళ్యం గ్రామంలో ప్రధాన రహదారిని కొందరు ఆక్రమించారని, సర్వేయర్‌తో కొలతలు చేయించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ సర్వేయర్, వీఆర్ఓను పంపి పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ ప్రకాశ్, గ్రామస్థులు షట్టప్ప, మమత, జయలక్ష్మమ్మ, పవిత్ర, పార్వతమ్మ, శ్రీదేవి, గీత, కాంతరాజు, చంద్రప్ప ఉన్నారు.

అందరికీ న్యాయం చేస్తాం

● టీడీపీ కోసం పనిచేసిన వారిని విస్మరించం ● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

అగళి, ఆగస్టు 5 : టీడీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. అగళి మండలంలో సోమవారం పర్యటన సందర్భంగా వారు మాట్లాడారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని నందరాజనపల్లి, ఇరిగేపల్లి గ్రామాలలోని తెలుగుదేశం నాయకులు, మాజీ మండల కన్వీనర్ ముకుందప్ప, చిక్కన్నను వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మండలంలోని కసాపురం, ఇనగలూరు, గ్రామాల్లో రహదారులు, తాగునీటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ఉమేష్, సత్యసాయి జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిరను అగ్రస్థానంలో నిలుపుతాం: ఎమ్మెల్యే

రాష్ట్రంలోనే మడకశిరను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రేణుక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మడకశిర అభివృద్ధికి సాయం అందించడంలో ముందుంటారన్నారు. అనంతరం పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ఉమేష్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, పరిపాలన అధికారి శ్రీనివాసరావు, ఎంఈఓలు శ్రీనివాస్, చంద్రశేఖర్‌నాయుడు, వార్డెన్ సికిందర్ బాషా తదితర అధికారులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమలను సత్కరిస్తున్న అభిమానులు

రైతులను ఆదుకోవాలి: సీపీఐ


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మడకశిరటౌన్, ఆగస్టు 5 : కరువు రైతులను ఆదుకోవాలని సోమవారం తహసీల్దార్ వెంకటేశులుకు మడకశిర నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి ఆదికేశవరెడ్డి, రైతు సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం నుంచి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు విత్తిన విత్తనాలు సైతం మొలకెత్తలేని పరిస్థితి నెలకొని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు సబ్సిడీతో విత్తనాలు అందించాలని ప్రతి రైతుకు రూ.20వేలు పెట్టుబడి సహాయం అందించాలని, 90 శాతం సబ్సిడీతో బిందు తుంపర సేద్యం పరికరాలను అందించాలన్నారు. సీపీఐ నాయకులు కన్నప్పమూర్తి, బాషా, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(సోమందేపల్లి) : కరువు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ నాయకులు బాలప్పాం కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అంజనేయులు, నూర్‌జహాన్, భారతి, అంజినమ్మ, హసీనా, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

● కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్


మాట్లాడుతున్న కమిషనర్

పెనుకొండ టౌన్, ఆగస్టు 5 : గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారి విషయంలో నగర పంచాయతీ, అధికారులపై తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ హెచ్చరించారు. ఆదివారం కొండాపురం, మంగాపురం, కోనాపురం వెళ్లే రహదారికి పాత రోడ్డును యధావిధిగా కొనసాగించాలని రాస్తారోకో నిర్వహించిన సంగతి తెలిసిందే. రహదారి వివాదంపై సోమవారం స్థానిక కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ పాత రోడ్డు పునరావృతం చేయాలని అందుకు సంబంధించిన భూ యజమాని సుదాకర్‌రెడ్డికి నోటీసులు అందించామన్నారు. ఆ రోడ్డుకు సంబంధించిన భూమి ప్రభుత్వ భూమి కాదని అది తమ సొంత ల్యాండ్ అని ఎక్కడా ప్రభుత్వ భూమి దురాక్రమణ చేయలేదన్నారు. పట్టాల్యాండ్ కావడంతోనే ఆ రహదారి విషయంపై అడ్డు చెప్పలేదన్నారు. అయితే ఈ గ్రామాలకు వెళ్లే రహదారి మరోచోట ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఎలాంటి వివాదాలకు తావు లేదన్నారు.

బాధ్యతల స్వీకరణ

పెనుకొండ టౌన్, ఆగస్టు 5 : పలు మండలాల్లో తహసీల్దార్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెనుకొండ తహసీల్దార్‌గా శ్రీధర్ బాధ్యతలు తీసుకున్నారు. తహసీల్దార్ శ్రీధర్‌కు మండల డీటీ, ఆర్ఐలు, వీఆర్ఓలు, సర్వేయర్లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు సొంతూరు చిత్తూరు జిల్లాకు వెళ్లారు.

విద్యార్థులకు క్రమశిక్షణే ఆయుధం

పెనుకొండ, ఆగస్టు 5 : విద్యార్థులకు క్రమశిక్షణే ఆయుధమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాధాకృష్ణరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థుల ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యక్తిత్వ వికాసనిపుణుడు రాధకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడి దరి చేరనీయకుండా ప్రశాంతంగా చదువుతుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై దళిత సంఘాల హర్షం

పావగడ, ఆగస్టు 5 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పునివ్వడంపై పావగడ దళిత సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి దళిత సంఘం నేత ప్రొఫెసర్ కిష్టప్ప, తెలంగాణ ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ ఫోటోలకు క్షీరాభిషేకం చేశారు. దండోరా అధ్యక్షుడు హనుమంతరాయప్ప, నాగేష్, మల్లికార్జున, పెద్దన్న, వెంకటేశ్, మంజునాథ్, తదితరులు తెలిపారు.

మడకశిర రూరల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సోమవారం మండలంలోని రేకలకుంట ఎస్సీ నాయకులు మారప్ప చంద్రప్ప, నాగరాజు, కరియప్ప, మూర్తప్ప, నరసింహులు, శంకరప్ప అంబేద్కర్‌కు నివాళి అర్పించారు.

ఇరు కుటుంబాల ఘర్షణ

● వివాదానికి కారణమైన చెత్త సమస్య


గాయపడిన రామమోహన్‌నాయుడు


భాస్కర్‌రెడ్డి

గోరంట్ల, ఆగస్టు 5: ఇంటి ముందు చెత్త సమస్య రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారి తీసింది. మండలంలోని తాటిమేకల పల్లిలో ఇంటి ముందు చెత్త విషయంలో రెండుకుటుంబాల మధ్య సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో రామమోహన్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. రామమోహన్‌నాయుడు టీడీపీ మద్దతుదారుడు, భాస్కర్ రెడ్డి వైసీపీ తరఫున పని చేస్తున్నారు. గ్రామంలో పక్కపక్కనే ఉన్న వాళ్ల ఇండ్ల మధ్య చాలాకాలంగా వివాదం నడుస్తోంది. సోమవారం రామమోహన్‌నాయుడు తల్లి కాంతమ్మతో చెత్త విషయంలో భాస్కర్‌రెడ్డి, ఓబులమ్మ ఘర్షణ పడ్డారు. ఈసందర్భంగా రెండు కుటుంబాల వారు కట్టెలు, రాళ్లతో దాడి చేసుకోగా, రామమోహన్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి తలలకు గాయాలయ్యాయి. వెంటనే 108లో ఇద్దరిని గోరంట్ల ఆసుపత్రికి తీసుకువచ్చారు. భాస్కర్‌రెడ్డితోపాటు ఆదినారాయణరెడ్డి, ఓబులమ్మ, పవన్, రామకృష్ణారెడ్డి, రామాంజనేయులు కలిసి రామమోహన్‌నాయుడు సోదరుడు ప్రతాప్‌నాయుడుపై దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. భాస్కర్‌రెడ్డి సైతం వారి కుటుంబ సభ్యులపై దాడిచేసినట్లు పేర్కొన్నారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు.

వృద్ధురాలి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 5: వృద్ధురాలు లక్ష్మమ్మ(70) మృతిపై సమగ్ర విచారణ చేపట్టి కారకులను చట్టపరంగా శిక్షించాలని సీపీఎం నాయకులు పెద్దన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అనుబంధ సంఘాల నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈనెల 1న మండల కేంద్రంలోని పాతూరులో రోడ్డుపై భిక్షాటన చేస్తున్న వృద్ధమహిళపై ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఓమ్నీ కారుదూసుకెళ్లింది. సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై సీపీఎం నాయకులు మాట్లాడుతూ నిండు ప్రాణాలు బలిగొన్న డ్రైవర్‌పై చర్యలు తీసుకోకుండా, విషయాన్ని కప్పిపెట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం డీటీ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం, డీసీఎం ఫొటోల అందజేత


సచివాలయ సిబ్బందికి ఫొటోలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర(అమరాపురం), ఆగస్టు 5 : అమరాపురం మండలం హేమావతి గ్రామ సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటోలను గ్రామ పంచాయతీ అధ్యక్షుడు చెన్నబసప్ప, ఓంకార్ సోమవారం పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, వార్డుమెంబర్ నాగరాజు, సీనియర్ దేశం పార్టీ నాయకులు శ్రీనివాస్, నాగభూషణం, డీలర్ హేమంత్‌రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ ఓంకార్, ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్, వాల్మీకి జిల్లా కన్వీనర్ మంజునాథ్, స్థానిక నాయకులు పూజారి రాము, సతీష్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొనగా సచివాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబు పునాది... మందకృష్ణ పోరాటం

మడకశిర టౌన్, ఆగస్టు 5: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేస్తూ ప్రత్యేక జీఓ ద్వారా అప్పట్లోనే పునాది వేశారని, మందకృష్ణ మాదిగ పోరాటం చేయడం ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక జీఓ ద్వారా ఏబీసీడీ వర్గీకరణ చేశారని, అప్పట్లోనే ఎంతో మందికి విద్య, ఉద్యోగాల్లో ఉపాధి కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చంద్రబాబుతోనే జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమన్నారు. యువతకు ఉద్యోగ కల్పన టీడీపీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గంగాధర్, నరసింహులు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్ జయకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయ కమిటీ ఎన్నికపై ఆసక్తి

లేపాక్షి, ఆగస్టు 5 : లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయ కమిటీ ఎన్నికలపైనే అందరికీ ఆసక్తి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దీపిక ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ఏగురురు డైరెక్టర్లు, ఓ చైర్మన్‌గా వైసీపీ నాయకులను ఎన్నుకున్నారు. కూటమి ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించడంతో టీడీపీలో ఎంతో కాలంగా కష్టపడి నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలు చైర్మన్ పదవిపై ఆశలు పెంచుకున్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆయన నిర్ణయం దిశ వారికే పదవి కట్టబెట్టాలని నేతలు భావిస్తున్నారు. గతంలో వైసీపీ కమిటీ సభ్యులు ఆలయంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలలో నిర్లక్ష్యం వహించారు. భక్తులకు కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు కూడా నిర్మించలేకపోయారని స్థానికులు వాపోతున్నారు. కొత్త కమిటీ సభ్యులైనా ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.

శీనప్పపల్లిలో చోరీ

గోరంట్ల, ఆగస్టు 5: మండలంలోని శీనప్పపల్లి గ్రామానికి చెందిన వడ్డే రమణప్ప ఇంట్లో ఈనెల 2వతేదీ రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ దనుంజయరెడ్డి తెలిపారు. వడ్డే రమణప్ప కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి తెల్లవారుజామున బెంగళూరుకు వెళ్లారు. తలుపులు పగలకొట్టి చోరీ జరిగినట్లు గ్రామస్థులు సమాచారం అందించారు. బెంగళూరు నుంచి తిరిగి వచ్చిన రమణప్ప పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బీరువాలో ఉన్న రూ. లక్ష నగదు, రెండుతులాల బంగారు నక్లెస్, 20 బంగారు పూసలు చోరీ జరిగినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ కళాశాలకు 'బి ప్లస్' గ్రేడ్

పెనుకొండ, ఆగస్టు 5 : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలను నాక్ బీప్లస్ గ్రేడ్ ప్రకటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ దాశేశవరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23, 24తేదీల్లో నేషనల్ అసిస్మెంట్ అండ్ అక్రిడియేషన్ కమిటీ కళాశాలను సందర్శించి మౌలిక సదుపాయాలు అకాడమీకి సంబంధించిన 40కొలమానలను చూసి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అధ్యాపకుల అభిప్రాయాలను తీసుకున్నారన్నారు. కార్పొరేట్ స్థాయిలో ఉన్న కళాశాలను చూసి కళాశాలకు బీప్లస్ గ్రేడ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ఆనందంతో స్వీట్లు పంచుకున్నారు. బీ గ్రేడ్ తో యూజీసీ ద్వారా నిధులు రావడానికి అస్కారం ఉందని, గతంలో వచ్చిన గ్రేడ్ క్రితం సీ గ్రేడ్ 1.89పాయింట్లు ఉన్న కళాశాల నేడు అన్ని హంగులతో అధ్యాపకుల సహకారంతో 2.74పాయింట్లతో బీగ్రేడ్ సాధించడం హర్షణీయమన్నారు. కో ఆర్డినేటర్ యశోదదేవి, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, అధ్యాపకులు హరీష్ బాబు, శ్రీదేవి, ప్రతాప్, రామన్న, హరిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

రక్తదానంతో ప్రాణం కాపాడిన మహిళ


రక్తదానం చేస్తున్న రాధ

హిందూపురం అర్బన్, ఆగస్టు 5: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రక్తదానం చేసి ఓ మహిళ ప్రాణాలను కాపాడింది. పట్టణ పరిధిలోని శ్రీకంఠాపురానికి చెందిన రాధ సోమవారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళకు అత్యవసరంగా 'ఏ' పాజిటివ్ రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న ఎండీఎస్ అల్ ఇండాద్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అమన్ విషయాన్ని రాధకు తెలియజేశారు. స్పందించిన ఆమె రక్తదానం చేసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు.

రేషన్ సక్రమంగా అందజేయాలి: నిమ్మల


రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ నిమ్మల

గోరంట్ల, ఆగస్టు 5: నిత్యావసరాలను పేదలకు సక్రమంగా అందజేయాలని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప డీలర్లకు సూచించారు. సోమవారం మండలంలోని వెంకటరమణ పల్లిలో చౌకధరల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్, సీనియర్ శ్రీరాములు, రామాంజి, అమర్‌నాథ్, గంగాధర్, జయచంద్ర, ఆదిమూర్తి, గంగాధరప్ప, చిన్న గంగులప్ప, రామచంద్రప్ప తదితరులున్నారు.

అగళి : నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని జడ్పీటీసీ ఉమేష్, మాజీ సర్పంచ్ రవికుమార్‌పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలో ఎపీపీ షాపును ప్రారంభించారు. గోవిందప్ప, రామచంద్రారెడ్డి, శివన్న, నాగరాజు, మహిళలు, తదితరులు ఉన్నారు.

గుడిబండ : సీఎం చంద్రబాబునాయుడు పేదలకు అందిస్తున్న నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప పేర్కొన్నారు. మండలంలోని హిరాల, బురదహళ్లి, దేవరహళ్లి ప్రభుత్వ రేషన్‌ దుకాణాలు ప్రారంభించారు. టీడీపీ నాయకులు శివకుమార్, భీమరాజు, ప్రకాష్, చిత్రశేఖర్, నన్నమారప్ప, నాగభూషణం, సిద్ధగంగప్ప, శీన తదితరులు పాల్గొన్నారు.

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండల పరిధిలో బసవనపల్లిలో రంగస్వామి, కనకసముద్రంలో తిప్పేస్వామి, ఆలదపల్లి, కె.శివరం, ఫుల్లీకుంట, వలస, అగ్రహారంలో రేషన్ పంపిణీని ప్రారంభించారు. టీడీపీ కన్వీనర్ గణేష్ మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

రొళ్ల : ఆవినకుంట, వన్నారనపల్లి గ్రామాల్లో రేషన్ దుకాణాలను వన్నారనపల్లి నారాయణప్ప, ఆవినకుంట మారన్న ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షులు దాసిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

హిందూపురం(పరిగి), ఆగస్టు 5 : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పరిగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను పలువురు చాటి చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పిల్లలుఆరోగ్యం బారిన పడకుండా వయసుకు తగిన బరువు ఎత్తుతో ఆరోగ్యంగా ఉండాలంటే పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలి. తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరిగి అలర్జీ, విరేచనాల బారిన పడకుండా ఉంటారన్నారు. డాక్టర్ నవీన, డాక్టర్ సుధారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ పద్మప్ప ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో రావిచెరువుకాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలోతల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు అజంతుల్లా, పద్మా అశోక్, కక్కల రఘునాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మేదర శ్రీనివాసులు, బోయ లక్ష్మీనారాయణ, సురేష్, సంతోష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రతన, ఏఎన్ఎంలు శాంతి, చరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, పిల్లలు, తల్లులున్నారు.

ఇష్టపడి చదివితేనే లక్ష్యసాధన సులభం: ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఆగస్టు 5 : ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలరని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని బాలాజీనగర్‌లోని సర్వోదయ కళాశాల ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల అంటే ఆందోళన చెందకుండా, నిర్దిష్ట ప్రణాళికతో, ప్రశాంతంగా చదవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఆదినారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నియోజకవర్గం అధ్యక్షుడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కల్యాణకిషోర్, టీడీపీ నాయకులు రమేష్, పట్టణ అధ్యక్షులు మనోహర్, మైనారిటీ అధ్యక్షులు భక్తర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ద్విచక్రవాహనంలోకి పాము

మడకశిరటౌన్, ఆగస్టు 5: పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఆపి ఉన్న ద్విచక్ర వాహనంలో పాము దూరడంతో స్థానికులు బెంబేలెత్తారు. సోమవారం గుర్రపుకొండ తండాకు చెందిన తిప్పేస్వామినాయక్ తన వాహనాన్ని సర్కిల్‌లో ఉంచారు. తిరిగి వెళ్లేందుకు బైక్ స్టార్ట్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ట్యాంకుపై పాము ప్రత్యక్షమయింది. ఆందోళనకు గురైన నాయక్ వెంటనే దిగిపోయాడు. అక్కడే ఉన్న కొందరు పామును కిందకు తీసి చంపేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



పాము చేరిన ద్విచక్ర వాహనం, పామును చంపేసిన దృశ్యం